క్లుప్తంగా

రక్తదానం మరొకరికి ప్రాణదానం



నెహ్రూసెంటర్: రక్తదానం చేయడం మూలంగా మారొకరికి ప్రాణదానం చేసిన వారం అవుతామని టౌన్ సీఐ వై.సతీష్ అన్నారు. మానుకోట ఆర్టీసీ ఆధ్వర్యంలో డిపోలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన కార్యక్రమాన్ని సీఐ ప్రారంభించారు. రక్తదాన కార్యక్రమంలో 26మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె.విజయ్, డాక్టర్ హితేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

దంతాలపల్లి: మండల ప్రజాపరిషత్ కార్యలయంలో మంగళవారం తొర్రూరు డీఎల్‌పీఓ షర్ఫుద్దిన్ మండలంలోని వివిధ గ్రామపంచాయతీల రికార్డులు తనిఖీ నిర్వహించారు. ఆగాపేట్, వేములపల్లి, రామానుజపురం, రామవరం, నిదానపురం, తూర్పుతండా, పెద్ద ముప్పారం గ్రామ పంచాయతీల రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ అప్సర్ పాషా, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల

మహబూబాబాద్ అర్బన్: గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఏటీఐఎం, ఫిజియోథెరఫీ, ఒకేషనల్ కోర్సుల్లో దరఖాస్తులు చేసుకున్న తెలంగాణ బాలబాలికల ఫలితాలు విడుదలయ్యాయని గిరిజన సంక్షేమ శాఖ ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులు తమకు కేటాయించిన కళాశాలలో విద్యార్థుల ధ్రువపత్రాలను ఈనెల 30వ తేదీలోగా సమర్పించాలన్నారు. వివరాలకు జిల్లా ఆర్‌సీఓ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

పనుల పరిశీలన

మహబూబాబాద్: అంబేడ్కర్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం పనులను చైర్మన్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 30న జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా జరిగే ప్రారంభోత్సవాలకు, పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు జరిగే ప్రాంతాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో సంజీవరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

విచారణ జరపాలి

కేసముద్రం: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాలలో నిత్యావసర వస్తువుల బిల్లుల చెల్లింపు విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, దీనిపై వెంటనే అధికారులు విచారణ జరపాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీసీసీ ఖాతాలో పడాల్సిన రూ.16లక్షలు వేరే వ్యక్తి ఖాతాలో ఎలా జమ అయ్యాయని, దీనిపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పెన్షనర్ల ధర్నాను విజయవంతం చేయాలి

మహబూబాబాద్: పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ ఆల్ పెన్షనర్ల రిటైర్డ్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆల్‌పెన్షనర్ల రిటైర్డ్ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్ల లింగయ్య, ప్రధాన కార్యదర్శి కాగితం వీరయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రావాల్సిన రెండు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బస్సు చార్జీలలో 40శాతం రాయితీ కల్పించాలన్నారు.

అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

కేసముద్రం: మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేసముద్రంలో అగ్నిప్రమాదం జరిగితే 18కిలోమీటర్ల దూరంలో ఉన్న మానుకోట నుంచి ఫైరింజన్ రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో బిచ్చానాయక్, సుగుణ, శంకర్, బోడియా పాల్గొన్నారు.

నిధులిచ్చిన ఘనత బీజేపీదే

పెద్దవంగర: గడిచిన తొమ్మిదేళ్ల పాలనలో గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులిచ్చిన ఘనత బీజేపీ దేనని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్ కార్యక్రమం సెల్‌ఫోన్‌లో వీక్షించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్, ఎస్సీమోర్చా ఉపాధ్యక్షుడు తలారి సోమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

గార్ల: ఆర్‌బీఐ ఫైనాన్షియల్ లిటరసీ అవేర్నెస్ కార్యక్రమంను పురస్కరించుకొని గార్ల ఎస్‌బీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం గార్ల హైస్కూల్లో గార్ల, బయ్యారం మండలాల స్థాయి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుచుకున్న విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ దిలీప్, హెచ్ఎంలు శీలంశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్ వెంకట్రావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలి

గూడూరు: ప్రతీ ఒక్కరూ బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నోడల్ ఆఫీసర్ భస్సీలాల్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో గూడూరు, కొత్తగూడ, గంగారం, బయ్యారం మండలాల పాఠశాలలకు చెందిన విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రశంస పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, హెచ్ఎంలు చీర భిక్షపతి, కాంతారావు పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో ముల్కలపల్లి జెడ్పీహెచ్ఎస్‌తోపాటు మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మండల స్థాయిలో జరిగిన క్విజ్ పోటీల్లో తొమ్మిది పాఠశాలల నుంచి ఇద్దరి చొప్పున పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు నగదు పురస్కారాలు నేరుగా వారి ఖాతాలలో జమ చేస్తామని ఐఎస్‌బీఐ మేనేజర్ కుమారస్వామి తెలిపారు.

పొదుపు అలవర్చుకోవాలి

కురవి: ప్రతీ ఒక్కరు విద్యార్థి స్థాయి నుంచే పొదుపును అలవర్చుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కురవి బ్రాంచీ మేనేజర్ భూక్య లాలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆర్థిక అక్షరాస్యత నేపథ్యంలో భారత రిజర్వు బ్యాంకు సౌజన్యంతో వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెచ్ఎం వాహిద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లో జెడ్పీఎస్ఎస్‌లో మంగళవారం ఎస్‌బీఐ కేసముద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్థిక అంశాలపై ప్రతిభ పరీక్షలను నిర్వహించారు. ఈపరీక్షల్లో 12పాఠశాలల నుంచి 24మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ గణపతి, నోడల్ హెచ్ఎం కొత్త జగన్మోహన్‌రెడ్డి, బండారు నరేందర్ తెలిపారు.

దంతాలపల్లి: నర్సింహులపేట మండలకేంద్రంలో నిర్వహించిన క్విజ్ పోటీలో దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీవాణి, చరణ్‌సాయి నగదు పురస్కారం అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనువాస్ తెలిపారు.



గార్ల: విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ దిలీప్



కురవి: ప్రశంస పత్రాలను అందజేస్తున్న బ్యాంకు మేనేజర్



గూడూరు: బాలుర హైస్కూల్‌లో..



డోర్నకల్: జెడ్పీహెచ్ఎస్‌లో..



కేసముద్రం విలేజ్‌లో..

సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం

గూడూరు: నాడు దివంగత నేత డాక్టర్ వైఎస్ పాలనలో ఇందిరమ్మ ఇంటి కల సాకారమైతే, రాబోయో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే నిరుపేదల సొంతింటి కల సాధ్యమవుతుందని నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ అన్నారు. మండలంలోని ఊట్ల, సరస్వతీనగర్ గ్రామాలలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ ఫలాలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోయో ఎన్నికల్లో కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పి, మరోసారి గతంలో డాక్టర్ వైఎస్ అందించిన రాజన్న రాజ్యం లాంటి కాంగ్రెస్ పాలనకు పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఊట్లకు చెందిన కాంగ్రెస్ నాయకుడి కుమారుడు అనారోగ్యంతో బాధపడుతుండగా, పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు అర్రెం వీరస్వామి, పూజారి శంకర్ గౌడ్, చీకటి శ్రీనివాస్‌గౌడ్, హెచ్ శివ పాల్గొన్నారు.



ప్రజలకు పథకాలను వివరిస్తున్న మురళీనాయక్

ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు అమ్మకాలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల పట్ల మధు, కేలోత్ సాయి కుమార్ డిమాండ్ చేశారు. విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం డీఈఓ రామారావుకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సింహాద్రి, మహేష్, ప్రవీణ్, నవీన్ పాల్గొన్నారు.

తొర్రూరు: ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అనుమతి లేని పాఠశాలలపై చర్య తీసుకోవాలని మంగళవారం డివిజన్ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇటీవల పట్టణంలో అనుమతి లేని ఓ ప్రైవేట్ పాఠశాలను సీజ్ చేసినప్పటికీ మరలా నాయకుల అండతో ప్రారంభించారన్నారు. మహేందర్, అమీర్, అజిత్, నజీర్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

కేసీఆర్ పాలనలో అన్నివర్గాలకు న్యాయం

మరిపెడ: కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం స్థానిక వర్తక, వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరిపెడ మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు ఎంతో కృషి చేశానన్నారు. మున్సిపాలిటీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసే బాధ్యత నాదే అన్నారు. ప్రతి ఎన్నికల్లో నాకు మీరు చూపిస్తున్న ఆదరణ మరిచిపోలేనన్నారు. ఇక ముందు కూడా మీరు దీవించి నన్ను ఆదరించాలని కోరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, హాకా చైర్మన్ మచ్చ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్ పర్సన్ సింధూర, వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ శారద, పీఏసీఎస్ చైర్మన్ యాదగిరిరెడ్డి, మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

ఉర్సు ఉత్సవానికి సిద్ధమైన కందిల్

మహబూబాబాద్ రూరల్: బక్రీద్ పండుగ సందర్భంగా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంలోగల సుప్రసిద్ధ హజరత్ సయ్యద్ ఇమాంషావలి దర్గాలో జరుగనున్న ఉర్సు ఉత్సవంలో సమర్పించనున్న కందిల్‌ను సిద్ధం చేశారు. ఈ నెల 29వ తేదీ గురువారం రోజున బక్రీద్ పండుగ జరుగనుండగా 30వ తేదీ శుక్రవారం రోజు రాత్రి కందిల్, గంధం ఊరేగింపు జరుపనున్నారు.

పోరాటాలతోనే హక్కులు

బయ్యారం: పోరాటాలు నిర్వహించటం వలనే ఉపాధ్యాయులు తమ హక్కులను సాధించుకోవచ్చని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షురాలు జి.వి.రమణమ్మ మంగళవారం అన్నారు. నాయకులు కృష్ణమూర్తి, అరుణ, ప్రసాదరావు, మంగయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూతగాదాలో ముగ్గురిపై దాడి

మహబూబాబాద్ రూరల్: మండలం వీఎస్.లక్ష్మీపురం గ్రామంలో జరిగిన భూతగాదాలో ముగ్గురిపై ఏడుగురు దాడి చేశారు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మంగళవారం బాధితులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పుణ్యపుర్తి యాకమ్మ పేరు మీద భూమి ఉంది. ఆ భూమిని తాను కొనుగోలు చేశానని అదే గ్రామానికి చెందిన బొర్రాజు లింగన్న అనే వ్యక్తి దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నాడు. జేసీబీతో పైపులు పగులగొట్టడం, పెద్ద మనుషులు ఏర్పాటు చేసిన హద్దురాళ్లను తొలగించడంతో పాటు యామక్మను భూమిలోకి రాకుండా అడ్డుకుంటున్నాడు. ఈ క్రమంలో యాకమ్మ, ఆమె కుమారుడు మహేష్, కోడలు రజిత సోమవారం భూమిలో దుక్కి దున్నేందుకు ట్రాక్టర్ తీసుకెళ్తుండగా లింగన్న మళ్లీ దౌర్జన్యం చేశాడు. ఆయనతో పాటు బొర్రాజు సురేష్, బొర్రాజు ఉమరాణి, బొర్రాజు విజయ్, పుణ్యపుర్తి యాకన్న, పుణ్యపుర్తి నిర్మల, పుణ్యపుర్తి ఐలయ్య ముల్లుకర్రలు, కారం పొడి, గొడ్డళ్లతో వారిపై హత్యాప్రయత్నం చేశారు. కాగా యాకమ్మ, ఆమె కొడుకు, కోడలు స్వల్పగాయాలతో బయటపడి మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొంది రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్సై రాంచరణ్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ జరిపారు.

సమస్యలు పరిష్కరించాలి

బయ్యారం: మండలంలోని ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బాణోత్ దేవేందర్ మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవటంతోపాటు మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రమోద్, చరణ్‌తేజ్, ప్రవీణ్, మనోహర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు నడుమ భూమికి హద్దులు



భూమికి హద్దులు పెడుతున్న అధికారులు

నర్సింహులపేట: మండలంలోని ఎర్రచక్రుతండాలో 180 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమి 2.11ఎకరాలకు మంగళవారం పోలీస్ బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేశారు. 2012 సంవత్సరంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం కోసం రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన భూమికి హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో కొందరు తండాకు చెందిన రైతులు అట్టి భూమిని సాగుచేసుకుంటున్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఉన్నాతాధికారులు అదేశించడంతో సీఐ మంగీలాల్, ఎస్సై జగదీష్, సిబ్బందితో బందోబస్తు నిర్వహించడంతో తహసీల్దార్ వివేక్ సిబ్బందితో వెళ్లి భూమి చుట్టు హద్దులు ఏర్పాటు చేశారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

మహబూబాబాద్ రూరల్: ఐసీడీఎస్ పరిరక్షణ కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.జయలక్ష్మి పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐసీడీఎస్ పరిరక్షణ కోసం ఈ నెల16 నుంచి జీపుజాతా ఆదిలాబాదులో ప్రారంభమై మంగళవారం మహబూబాబాద్ జిల్లాకు చేరుకుంది. ఈసందర్భంగా వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు అవుతుందని, ఉద్యోగుల జీతాలు పెంచలేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ, జిల్లా కార్యదర్శి స్నేహబిందు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, ఉపేందర్, సరోజ, తిరుపతమ్మ, మంగమ్మ, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

భూములకు పట్టాలు ఇవ్వాలని ఆందోళన



ధర్నా చేస్తున్న నాయకులు

గార్ల: మండలంలోని చిన్నబంజర, కట్టుకుంట తండా గ్రామాల్లో తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న గిరిజన రైతుల భూములకు పట్టాలు ఇవ్వాలంటూ మంగళవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో గార్లలో ప్రదర్శన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఉద్దేశించి ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సక్రు మాట్లాడారు. పట్టాలు లేక ప్రభుత్వ పథకాలకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్ వీరన్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీరభద్రం, మాన్యా, మనోహర్, పంచీరామ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని వదిలేసి భూకబ్జాలు

నెల్లికుదురు: కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించుతేనే తెలంగాణ రాష్ట్రానికి మంచిరోజులని, లేకుంటే కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ అంతా ఆగమైపోతుందని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. స్థానిక విశ్రాంతి భవనంలో మంగళవారం మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల తోపాటు వారి అనుచరులు అభివృద్ధిని వదిలేసి భూకబ్జాలు, దందాలకు పాల్పడుతూ వ్యవస్థను నీరుగారుస్తున్నారని, ధరణి పోర్టల్‌తో రైతులంతా ఆగమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ హెచ్ వెంకటేశ్వర్లు, పూర్ణచందర్, మానేందర్, మల్లేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటనారాయణ

నూతన కమిటీ ఎన్నిక

పెద్దవంగర: మండలంలోని చిట్యాల గ్రామంలో మంగళవారం సంఘం మండల అధ్యక్షుడు రాపోలు శ్రీనివాస్, కార్యదర్శి ఎనగందుల సంతోష్ సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కోట అశోక్, కోశాధికారిగా కోట శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా అనబత్తుల సతీష్, కోట యాదగిరి, సహాయ కార్యదర్శిగా రాపోలు లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా అనబత్తుల సోమయ్య, రాపోలు వెంకటేశ్వర్లు, జనార్దన్, కోట రాజమహేందర్, గౌరవ సలహాదారుడిగా సోమనర్సయ్య, రాంనారాయణ నియమితులయ్యారు.

సంక్షిప్త సమాచారం

మద్యం తాగి వాహనం నడపొద్దు

మహబూబాబాద్ రూరల్: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ట్రాఫిక్ ఎస్సై భద్రునాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సిబ్బంది మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా 11 మందిపైన కేసులు నమోదు చేసి రూ.5,500 జరిమానాలు విధించారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

బస్టాండ్ స్థల పరిశీలన

డోర్నకల్: స్థానిక బైపాస్ రోడ్డులోని ఆర్‌టీసీ బస్టాండ్ స్థలాన్ని మంగళవారం ఆర్టీసీ అధికారులు పరిశీలించారు.ఆర్టీసీ స్థలంలో ధోబీఘాట్‌ను నిర్మిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు ఆర్‌టీసీ డిప్యూటీ రీజనల్ రీజనల్ మేనేజర్ కృపాకర్‌రెడ్డి, మహబూబాబాద్ డిపో మేనేజర్ విజయ్‌కుమార్ మున్సిపల్ చైర్మన్ వీరన్నతో ఆర్‌టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. ఆర్‌టీసీ స్థలాలు ఆక్రమణకు గురి కాలేదని వారు నిర్ధారించారు.

కొత్త రేషన్ కార్డుల జారీ లేదు

కురవి: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రేషన్‌కార్డులను జారీ చేస్తున్నట్లు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని సీరోలు తహసీల్దార్ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త రేషన్‌కార్డులు జారీ చేస్తున్నట్లు వస్తున్న సమాచారం నమ్మవద్దని, ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన వెంటనే తామే సమాచారం అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

తాగునీటి సమస్యలతో ఇబ్బందులు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిత్యం తాగునీటి సరఫరా నిలుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం పట్టణానికి భగీరథ నీటి సరఫరా నిలవడంతో నీరు దొరకక ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో మున్సిపాలిటీ ట్యాంకర్‌తో పలు వీధులకు నీటిని సరఫరా చేశారు. తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చర్య తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో పలు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు సీసీఓ గణేష్, దర్గయ్య నోట్ పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు.

మహబూబాబాద్ రూరల్: వరంగల్ కు చెందిన శ్రీ షిర్డీ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని మొట్ల తండ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాల పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి

పెద్దవంగర: కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి లభిస్తోందని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నాల రైతువేదికలో సెర్ప్, శ్రీనిధి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడో విడత కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్య, ఉప సర్పంచ్ లచ్చమ్మ, ఏపీఎం నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న ఉపేందర్ భార్య ఇటీవల మృతి చెందింది. ఈమేరకు మంగళవారం బాధిత కుటుంబానికి చాంబర్ ఆఫ్ కామర్స్ కేసముద్రం ఆధ్వర్యంలో 2క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రభుకిరణ్, కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

చీరల పంపిణీ

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల ప్రజావైద్యశాలలో మంగళవారం వైద్యాధికారి చైతన్య ఆశ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బాలాజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేసును వెంటనే ఎత్తివేయాలి

గార్ల: పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య పై ములుగు జిల్లా తాడ్వాయి పోలీసులు మోపిన ఉపా కేసును వెంటనే ఎత్తివేయాలని పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు ఎం.సైదక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాల్‌పోస్టర్లతో మద్దివంచ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుసిని బాబూరావు, నాయకులు గౌని భద్రయ్య, మల్లేశం, శ్రీరాములు పాల్గొన్నారు.

వివాహిత మృతి

గార్ల: మండలంలోని తిర్లాపురం గ్రామానికి చెందిన పాల్తియా సోనియా(32) చిన్న వయస్సులోనే హైబీపీతో బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై మంగళవారం హఠాన్మరణం పొందారు. ఇంట్లో పనిచేసుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలడంతో ఆమెను హుటాహుటిన స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది.

భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలి

కొత్తగూడ: యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే సీతక్క తనయుడు సూర్య అన్నారు. ఈమేరకు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఓటాయి, ముస్మి, గాంధీనగర్‌తో పాటు పలు గ్రామాల యువకులకు వాలీబాల్ కిట్‌లను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయినేని ప్రశాంత్‌రెడ్డి, సర్పంచ్ మల్లెల రణధీర్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

హెచ్ఎంకు సన్మానం

కురవి: ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ గెజిటెడ్ హెచ్ఎంగా ఎంపికైన మండలంలోని మోద్దులగూడెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం బి.శంకర్‌నాయక్‌ను కాంప్లెక్ పరిధిలోని ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుండ్ల విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు అబ్దుల్లా, బాబురావు, సింగం మనోహర్, గుగులోత్ వెంకన్న, ఓడెల శివకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

డోర్నకల్: మండలంలోని కాంపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా పిండిప్రోలుకు చెందిన సుంకర రమేష్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా కాంపల్లి క్రాస్ రోడ్డు వద్ద వాహనం అదుపు తప్పి కిందపడటంతో రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో మహబుబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం ముడుపుగల్ గ్రామ శివారులో నిల్వ ఉంచిన 2క్వింటాళ్ల నల్లబెల్లం, 50కిలోలపటికను స్వాధీనం చేసకున్నామని రూరల్ ఎస్సై రాంచరణ్ మంగళవారం రాత్రి తెలిపారు. గ్రామ శివారులో తనిఖీలు చేస్తున్న సమయంలో శ్యామల సాయిలు రేకుల షెడ్డు సమీపంలో బాబులు అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా ఆ రేకుల షెడ్డులో 2 క్వింటాళ్ల నల్లబెల్లం, 50కిలోల పటిక దాచి ఉంచినట్లు తెలిపాడన్నారు. వెంటనే స్వాధీనం చేసుకొని, అయోధ్య గ్రామ శివారు భజనతండాకు చెందిన బాబులు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. మరో ఇద్దరు నిందితులు సురేష్, మల్లేష్ పరారీలో ఉన్నారన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కురవి: మండల కేంద్రం శివారు లింగ్యాతండా గ్రామంలో ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ సీడీఎఫ్ నిధులు రూ.10లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బజ్జూరి పిచ్చిరెడ్డి, సర్పంచ్ బాదావత్ రవి, ఆలయ మాజీ చైర్మన్ బాదావత్ రాజునాయక్, నాయకులు గుగులోత్ రవినాయక్, రామకృష్ణ, బాదావత్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

